

కేసీఆర్‌తో ఎమ్మెల్యేల భేటీ

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ తదితరులు ఆయనను కలిశారు. వారు కేసీఆర్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలపై చర్చించినట్టు తెలిసింది.

ప్రవీణ్‌రెడ్డి ఎక్కడ?

290 ఎకరాల లావణిపట్టా భూముల ఆక్రమణ విఫలం

'నమస్తే' కథనంతో బండారం బట్టబయలు కావడంతో ఆగమాగం

ఎమ్మార్వో ఫిర్యాదులో అతుల్యం హోమ్స్ కంపెనీ డైరెక్టర్ పేరు తొలగింపు

భూమి కాజేసేందుకు యత్నించిన ప్రవీణ్‌రెడ్డిని విచారణకు పిలవని వైనం

ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ జరగలేదని రైతులతో చెప్పించే యత్నం

(స్పెషల్ టాస్క్‌బ్యూరో)

కోట్ల రూపాయల ధర పలికే ప్రభుత్వ భూమిని చెరబడుతున్నారని, ఇవిగో ఆధారాలు అంటూ 'నమస్తే తెలంగాణ' సంచలనాత్మక కథనం ప్రచురిస్తే, దానిపై విచారణ జరిపి ఆ భూమిని రక్షించాల్సింది పోయి ఆ విషయాన్ని ప్రజల ముందుంచిన నమస్తే తెలంగాణ దినపత్రికపై కక్ష సాధింపు చర్యలకు రేవంత్ సర్కార్ దిగడం విడ్డూరంగా ఉంది. సాధారణంగా ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నదన్న సమాచారం తెలిస్తే సంబంధిత రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి ఆ భూమిపై లోతుగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారు. సదరు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయిస్తారు. కానీ ఇక్కడ అది జరగలేదు. నమస్తే తెలంగాణ కథనాన్ని ఆధారంగా చేసుకుని మీర్‌పేట పోలీసులకు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పోలీసులు రెవెన్యూ అధికారుల ఫిర్యాదును ఏమాత్రం పట్టించుకోలేదు. అంతేకాదు, బాలాపూర్ ఎమ్మార్వో ఇచ్చిన ఫిర్యాదు కాపీలో అతుల్యం హోమ్స్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి పేరును పొందుపర్చినా సదరు వ్యక్తిని పోలీసులు విచారణకు పిలవకుండా చోద్యం చూడటం అనుమానాలకు తావిస్తున్నది. ఎమ్మార్వో ఫిర్యాదు కాపీలో ప్రవీణ్‌రెడ్డి పేరును మార్చి మరీ ఫిర్యాదును పోలీసులు తారుమారు చేసినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇంత పెద్ద వ్యవహారంలో రెవెన్యూ అధికారులే కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ వారిని పక్కనెట్టి 'నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు' అన్న చందంగా పోలీసులే తమ చేతుల్లోకి తీసుకుని పెద్ద తలకాయల సూచనలు అమలు చేస్తున్నారు. ఇటువంటి వికృత భూ క్రీడ వెనక ఉన్న ఆ అదృశ్య శక్తులకు కొమ్ముకాస్తున్నారు.

విచారణ శూన్యం.. ఆ రహస్యమేంటి?

అది రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలో సర్వే నంబర్ 92లో సుమారు 291.32 ఎకరాల ప్రభుత్వ భూమి. ఈ భూమిని ల్యాండ్ పూలింగ్ చేసి ఓ కంపెనీ మాటున చెర పట్టేందుకు బిగ్ బ్రదర్స్ ప్రణాళిక రూపొందించారు. ఈ వ్యవహారాన్ని నమస్తే తెలంగాణ గురువారం వెలుగులోకి తీసుకొచ్చింది. సమాంతర వ్యవస్థగా ఏర్పడి భూములకు ఎన్‌వోసీ, పాస్ పుస్తకాలు తెస్తామంటూ అతుల్యం హోమ్స్ డైరెక్టర్ ప్రవీణరెడ్డి పేరిట రైతులతో ఒప్పందాన్ని కూడా పూర్తయిన వైనాన్ని ఆధారాలతో సహా ప్రచురించింది. కానీ 292.32 ఎకరాల ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను తప్పుదోవ పట్టించేందుకు, దీని వెనక ఉన్న సూత్రధారులను కాపాడేందుకు పోలీసులు నిబంధనలకు విరద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కార్ భూమి కబ్జాకు గురవుతున్నదంటూ బాలాపూర్ ఎమ్మార్వో ఫిర్యాదు చేసినా ఆ మేరకు విచారణ జరపకుండా అంతా గప్‌చుప్ అయ్యేలా పరిస్థితులను మార్చేశారు. ఇదంతా పై శక్తుల కనుసన్నల్లోనే జరిగింది. నమస్తే తెలంగాణ కథనం ప్రచురితం కావడంతో పావులు కదిపిన అదృశ్య శక్తులు.. పోలీసులకు ఏం చెయ్యాలో సూచనలు అందించినట్టు తెలిసింది. దీంతో వారి ఆదేశాల మేరకు ఎమ్మార్వో ఫిర్యాదులో ఉన్న ఆ కంపెనీ డైరెక్టర్ పేరును తొలగించారు. ఎఫ్ఐర్ కాపీలో అన్‌నోన్ పర్సన్ అంటూ పేరు మార్చించారు. దీంతో ప్రభుత్వ భూమిని కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్న వారిని పోలీసులే రక్షిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

ఆ అదృశ్య శక్తులు ఎక్కడ?

కూపీ లాగితే డొంక కదిలేది. అందుకు నమస్తే తెలంగాణ కీలక ఆధారాలను సైతం పోలీసుల ముందుంచింది. బాలాపూర్ ఎమ్మార్వో ఫిర్యాదుపై విచారణ జరిపితే వందల కోట్ల విలువచేసే సర్కార్ భూములను చెరబట్టడానికి ప్రయత్నించిన ముఠా బాగోతం బయటపడేది. ముఠా వెనక ఉన్న ఆ పై శక్తులు ఎవరనేది తేలిపోయేది. ఎమ్మార్వో అందించిన మొదటి ఫిర్యాదు కాపీలో ప్రవీణ్‌రెడ్డి గుట్టు విప్పేలా కంపెనీ వివరాలు ఉన్నప్పటికీ పోలీసులు ఆ దిశగా విచారణ జరపలేదు. గూగుల్‌లో సైతం సదరు కంపెనీ ఫోన్ నంబర్లతో సహా వివరాలన్నీ ఉన్నాయి. వారిని పోలీసులు విచారిస్తే భూమాయ అధికారికంగా వెలుగులోకి వచ్చేది. కానీ ఆ విచారణ అలా జరగకుండా భక్షించే వారిని కాపాడాలనే దిశగా సాగడంతో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ఇప్పుడు అనేక అనుమానాలకు దారి తీసింది. ల్యాండ్ పూలింగ్ బాధ్యులు బయటకు వస్తే ఆ అదృశ్య శక్తుల దందా బహిర్గతమయ్యే పరిస్థితులు ఉండటంతో అసలుకే మోసం వస్తుందని గ్రహించిన సూత్రధారులు ల్యాండ్‌పూలింగ్ ప్రక్రియ జరగలేదనే వార్తలను ప్రచారం చేయించే పనిలో పడ్డారు. ఇందుకోసం కొంతమంది రైతులను పావులుగా వాడుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోలీసులా కీలుబొమ్మలా?

మొదటిపేజీ తరువాయి...

విస్మరించారు. అక్రమమైతే నీకేంది? నువ్వెందుకు ఫిర్యాదు చేశావంటూ పక్కింటి వ్యక్తిపైనే కేసు నమోదు చేశారు. అక్రమాలను బయటపెడితే కేసులు తప్పవంటూ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. చివరకు అక్రమంగా ఆ ఆస్తిని కాజేయాలనుకున్న వ్యక్తి పేరు, ఆధార్ నంబర్, చిరునామా అన్నీ ఉన్నా ఆయనెవరో తెలియదంటూ 'గుర్తు తెలియని వ్యక్తి' అంటూ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అక్రమాలు జరుగుతాయి. దాని వెనక ఎవరు ఉన్నారో చూసుకోవాలి కదా? తెలిసినంత మాత్రాన గొంతెత్తి బయటకి చెబుతావా? అంటూ పక్కింటి వ్యక్తిని కేసు ద్వారా హెచ్చరించారు.

కార్పొరేట్ యంత్రాంగం వత్తాసు

బిగ్ బ్రదర్స్ ల్యాండ్ పూలింగ్‌పై తెలంగాణ పోలీసుశాఖ తీరుకు అద్దంపట్టే ఉదాహరణ ఇది. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచి అనేక రివార్డులు పొందిన తెలంగాణ పోలీసు శాఖ పని తీరు ఇది. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ లోని సర్వే నంబర్ 92లోని సుమారు 300 ఎకరాల భూమిని కొల్లగొట్టేందుకు కొన్ని శక్తులు కుట్రపన్నితే దానిని 'నమస్తే తెలంగాణ' ఆధారాలతో సహా బయటపెట్టింది. ప్రభుత్వ భూమిని, గ్రామ అవసరాలకు ఉపయోగపడే భూములను ఒక కంపెనీకి ధారదత్తం కావడాన్ని అడ్డుకున్నది. అతుల్యం కంపెనీ ప్రతినిధులు వచ్చి రైతులను మభ్యపెట్టి అనధికార ఒప్పందాలను చేసుకుంటుంటే కండ్లు మూసుకున్న అధికార యంత్రాంగం కనీసం ఆ విషయం బయటపడిన తర్వాతనైనా బాధ్యాతయుతంగా, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి. కానీ ఒక వైపు మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూములను కార్పొరేట్ కంపెనీ కబళించేందుకు యత్నిస్తే మాత్రం దానికి వత్తాసు పలకడం సామాన్యుడిని ఆలోచింపజేస్తున్నది. ముఖ్యంగా అతుల్యం హోమ్స్ ఎవరిది? ప్రవీణ్‌రెడ్డి ఎవరు? అంటూ రెండు రోజుల పాటు విచారణ చేసిన తెలంగాణ పోలీసు శాఖ, ఇంటెలిజెన్స్ విభాగం చివరకు నాదర్‌గుల్ భూములపై ఒప్పందం చేసుకున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తి(అన్ నోన్ పర్సన్) అంటూ కేసు నమోదు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

'నమస్తే'పైనే కేసా?

'కబ్జాలోకి ప్రభుత్వ భూమి.. కాపాడుకోండి' అంటూ రేవంత్ సర్కార్‌కు 'నమస్తే తెలంగాణ' ఆధారాలతో సహా కథనాన్ని కండ్ల ముందుంచింది. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవకుండా నమస్తే తెలంగాణ దినపత్రిక విస్తుగొలిపే విషయాలతో సంచలన కథనం ప్రచురించింది. దీనిపై విచారణ చేయకుండా 'నమస్తే తెలంగాణ' పైనే ఎదురుదాడికి దిగేందుకు కుట్ర పన్నారు. అందులో భాగంగా పోలీసులు 'నమస్తే తెలంగాణ'పైనే కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉంది. ఈ విషయంపై నమస్తే తెలంగాణ ప్రతినిధి మీర్‌పేట్ సీఐకి ఫోన్ చేసి కేసుకు సబంధించి వివరాలు అడిగితే సదరు సీఐ నమస్తే తెలంగాణపై ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని స్పష్టం చేశారు. కానీ ఆ ఫిర్యాదు కాపీని సూత్రధారుల అనుకూల మీడియాకు లీక్ చేశారు. సదరు ఫిర్యాదు కాపీ సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ చేయించారు. పబ్లిక్ డొమైన్‌లో ఎఫ్ఐఆర్ కాపీ లేకుండా రహస్యంగా ఉంచడం అనుమానాలకు దారి తీస్తుంది.

సీఐతో నమస్తే సంభాషణ

నమస్తే తెలంగాణ ప్రతినిధి: సార్ నమస్తే

సీఐ: నమస్తే చెప్పండి

నమస్తే తెలంగాణ ప్రతినిధి: బాలాపూర్ తహసీల్దార్ నాదర్‌గుల్ రెవెన్యూ సర్వే నంబర్ 92కు సంబంధించిన విషయం పై ఏమైనా ఫిర్యాదు చేశారా సార్? ఈ విషయం గురించి రెండు రోజుల నుంచి ఫోన్ చేస్తున్నాను కదా సార్.

సీఐ: అవును నేను బీజీగా ఉన్నాను.

నమస్తే తెలంగాణ ప్రతినిధి: తహసీల్దార్ ఫిర్యాదు చేశామన్నారు.

సీఐ: నేను చూడలేదు తెలుసుకుంటాను. సదర్ మేళాలో ఉన్నాను.

నమస్తే తెంలగాణ ప్రతినిధి: ఫిర్యాదు చేయలేదన్నారు కదా ఎఫ్ఐఆర్ చేశారని తెలిసింది.

సీఐ: పై నుంచి నాకు ఒత్తిడి ఉందబ్బా.

నమస్తే తెంలగాణ ప్రతినిధి: నేను చాలా సార్లు ఫోన్ చేసినా మీరు స్పందించకుండా ఒక మీడియా(దిశ)కు ఎఫ్ఐఆర్ ఎలా బయటకు ఇచ్చారు సార్.

సీఐ: నేను ఇవ్వలేదు ఎవరు ఇచ్చారో తెలుసుకుంటాను.

నమస్తే తెలంగాణ ప్రతినిధి: మేము పదేపదే అడుగుతున్నాము కదా సార్, ఇతర మీడియా సంస్థలకు ఎలా ఇస్తారు? మాకు ఎందుకు ఇవ్వరు సార్? కేసు మాపైన అయింది కదా?

సీఐ: నాకు అందరు సమానమే.

నమస్తే తెలంగాణ ప్రతినిధి: అయితే మాకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు.

సీఐ: హడావుడిగా ఉన్నాను. తర్వాత చెపుదామనుకున్నాను.

నమస్తే తెలంగాణ ప్రతినిధి: సార్ పక్షపాతం చూపిస్తున్నారు.

సీఐ: నేను మేజర్ పత్రికలకు ఇవ్వకుండా దిశకు ఎలా ఇస్తాను?

నమస్తే తెలంగాణ ప్రతినిధి: మీ నుంచి దిశకు సమాచారం వచ్చిందని తెలిసింది సార్

సీఐ: నేను ఇవ్వలేదు.

నమస్తే తెలంగాణ ప్రతినిధి: నమస్తే తెలంగాణ అనగానే ఎప్పుడూ ఇలానే చేస్తున్నారు సార్

సీఐ: అదేం లేదు. ఇక నుంచి అలా జరగకుండా చూస్తాను. నాకు తెలియకుండా దిశకు ఎఫ్ఐఆర్ ఎవరు ఇచ్చారో పరిశీలిస్తాను. రైతులు నమస్తే తెలంగాణ పై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ గుర్తుతెలియని వ్యక్తులపై ఫిర్యాదు చేశారు.

నమస్తే తెలంగాణ ప్రతినిధి: ముందు ఎందుకు చెప్పలేదు సార్

సీఐ: సరే పోనివ్వండి ఇక నుంచి తప్పకుండా సమాచారం ఇస్తాను

లోకం పోకడ



అంతరిక్షానికి కాదు, హస్తినాపురం వెళ్తున్నాడు!

బిగ్ బాంబ్ ప్రకంపనలు

దీపావళికి ఆటంబాంబులా పేలిన 'నమస్తే తెలంగాణ' ఎక్స్‌ప్లోజివ్ స్టోరీ

సంచలనమైన 'బిగ్ బ్రదర్స్' కథనం

ఆంగ్లంలోకి తర్జుమా చేసి అధిష్ఠానానికి ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : పేద రైతులకు పంపిణీ చేసిన లావణి పట్టా భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో కొట్టేసేందుకు వేసిన చీకటి ఎత్తును వెలుగులోకి తెస్తూ 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. నగరానికి ఉత్తరాన ఫోర్త్‌సిటీ పేరుతో బేగరి కంచె చుట్టూ వేల ఎకరాల అసైన్డ్ భూములు, సీలింగ్ భూములను చెరపట్టిన 'బిగ్ బ్రదర్స్', తాజాగా రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో 290 ఎకరాల అసైన్డ్ భూములను కొట్టేసేందుకు చేసిన ప్రయత్నాన్ని గత నెల 31న నమస్తే తెలంగాణ దిన ప్రతిక బట్టబయలు చేసింది. 'బిగ్ బ్రదర్స్ ల్యాండ్ పూలింగ్' అనే పతాక శీర్షికతో అచ్చయిన ఈ ఎక్స్‌ప్లోజివ్ స్టోరీ దీపావళి సందర్భంగా ఆటంబాంబులా పేలింది. ఈ కథనం క్లిప్పింగులకు 'బిగ్ బ్రదర్ కుటుంబ అనివీతి' అనే క్యాప్షన్ జత చేసి కాంగ్రెస్ వర్గాలే సోషల్ మీడియా గ్రూప్‌ల్లో వైరల్ చేశాయి. కాంగ్రెస్ పార్టీలో కొంత మంది మంత్రుల అనుచరులు, దిగువ శ్రేణి నాయకులు తమ వాట్సాప్ స్టేటస్‌గా ఈ కథనాలను పెట్టుకున్నారు. గ్రామీణ ప్రాంత పార్టీ కార్యకర్తల వాట్సాప్ గ్రూపుల్లో పెద్ద ఎత్తున షేర్ చేశారు. రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం జిల్లాల కీలక నేతలు కొందరు ఎవరికి వారిగా ఈ కుటుంబ అనినీతి కథనాలను ఆంగ్లంలోకి తర్జుమా చేసి అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు కాంగ్రెస్ కార్యకర్తలే చెప్తున్నారు.

ఫోర్త్ సిటీకీ మెట్రో

పరిపాలనా అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం

24,269 కోట్లతో మెట్రో రైల్ రెండో దశ నిర్మాణం

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మాణం

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశతో పాటు కొత్తగా ప్రతిపాదించిన ఫోర్త్ సిటీకి మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. 5 కారిడార్లలో మొత్తం 76.4 కి.మీ. పొడవున చేపట్టే మెట్రో రైల్ రెండో దశ నిర్మాణానికి రూ.24,269 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.7,313 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.4,230 కోట్లు సమకూర్చనుండగా.. జైకా, ఏబీడీ, ఎన్‌డీబీ లాంటి ఆర్థిక సంస్థల నుంచి రూ.11,693 కోట్ల రుణాలు తీసుకోనున్నారు. మిగిలిన రూ.1,033 కోట్లను పీపీపీ విధానంలో వెచ్చించాలని నిర్ణయించారు. దీనికి ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, ఆర్థిక శాఖ ఆమోదం సైతం లభించడంతో తాజాగా ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేస్తూ జీవో 196ను జారీ చేసింది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు మొదటి దశలో రూ.22 వేల కోట్లతో 3 కారిడార్లలో 69 కి.మీ. మార్గాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రకటించిన ఫోర్త్ సిటీకి మెట్రో మార్గాన్ని (కారిడార్-9) నిర్మించేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ప్రతిపాదనలను రూపొందించింది. దీనిలో భాగంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఓఆర్ఆర్ మీదుగా కొంగరకలాన్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ. మార్గం నిర్మాణానికి కూడా ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ కారిడార్‌కు సంబంధించిన అలైన్‌మెంట్, ఇతర ఫీచర్లు, ప్రాజెక్టు నిర్మాణ వ్యయంపై మెట్రో అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నట్టు జీవోలో పేర్కొన్నది.

మీర్‌పేట చౌరస్తాలో 'నమస్తే తెలంగాణ' ప్రతులను దహనం చేస్తున్న కొందరు రైతులు, పక్కనే ఉండి వారిని ఉసిగొల్పుతున్న ప్రవీణ్‌రెడ్డి కంపెనీ ప్రతినిధులు

కుట్రకు సాక్ష్యం.. ఇదే సత్యం!

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఈ ఫొటో చూశారా? ప్రభుత్వ భూమిని కాపాడేందుకు 'బిగ్ బ్రదర్స్ కుట్రను 'నమస్తే తెలంగాణ' బయటపెట్టింది. దీంతో ఉక్కిరిబిక్కిరి అయిన బిగ్ బ్రదర్స్ అండ్ కో అమాయక రైతులను రెచ్చగొట్టేందుకు కుతంత్రాలు పన్నింది. ఇందులో భాగంగా రెండు రోజుల కిందట కొందరు రైతులు, మరికొందరు భూమికి సబంధం లేని వ్యక్తులతో హైదరాబాద్ పరిధిలోని మీర్‌పేట చౌరస్తాలో 'నమస్తే తెలంగాణ' ప్రతులను దహనం చేసే కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా తెర వెనక ఉన్న అదృశ్య శక్తులతో పాటు అతుల్యం హోమ్స్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి. అందుకే దగ్గర ఉండి రైతులను ఉసిగొల్పి మీర్‌పేట చౌరస్తాలో 'నమస్తే తెలంగాణ' ప్రతుల దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పైకి రైతులే స్వచ్ఛందంగా చేసినట్టు చెప్తున్నా, ప్రభుత్వ పెద్దకు చెందిన మీడియాలోనే ఆ గుట్టు రట్టయింది. సదరు కంపెనీ ప్రతినిధులు అక్కడే ఉండి రైతులతో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారనేందుకు ఈ దృశ్యమే సాక్ష్యం. ఈ కార్యక్రమంలో పలువురు సంబంధం లేని వ్యక్తులు పాల్గొనడం గమనార్హం.

కేసీఆర్ కలల ప్లాంట్ రెడీ

సిద్ధమైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ • నేడు బొగ్గు బోగీని ప్రారంభించనున్న మంత్రులు

దామరచర్ల, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతో తలపెట్టిన బృహత్తరమైన ప్రాజెక్టు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వెలుగులు పంచేందుకు సిద్ధమైంది. కేసీఆర్ పాలనలోనే 90 శాతం పనులు పూర్తి చేసుకున్న ప్లాంట్‌ను నేడు మంత్రులు ప్రారంభించనున్నారు. దక్షిణాదిలో అతిపెద్దదైన నల్లగొండ జిల్లాలోని యాదాద్రి పవర్ ప్లాంట్ మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తిస్థాయిలో కాంతులు విరజిమ్మనుంది. ప్లాంటుకు అనుసంధానంగా రైల్వేలైన్లు పూర్తికావడంతో రామగుండం నుంచి బొగ్గు వ్యాగన్‌తో పాటు మొదటి యూనిట్ సింక్రనైజేషన్‌ను మంత్రులు ప్రారంభించనున్నారు. ఈ నెలాఖరు నుంచి ప్లాంట్ ద్వారా తెలంగాణకు 1600 మెగావాట్ల విద్యుత్ సరఫరా కానుంది.

కేసీఆర్ దార్శనికతకు నిదర్శనం

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ కరెంట్ కష్టాలతో విలవిల్లాడింది. మరోవైపు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే చీకట్లు తప్పవని నాటి పాలకులు భయపెట్టారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ విద్యుత్ కష్టాలు తొలగించడంలో భాగంగా కేసీఆర్ పలు విప్లవాత్మక చర్యలు చేపట్టారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 2015 జూన్ 8న యాదాద్రి పవర్ ప్లాంట్‌కు కేసీఆర్ భూమిపూజ నిర్వహించారు. రూ.30వేల కోట్లతో 4000 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణ బాధ్యతలను బీహెచ్ఈఎల్‌కు అప్పగించారు. 5 ప్లాంట్ల పనులు అక్టోబర్ 2017లో ప్రారంభమయ్యాయి. 5,668 ఎకరాల భూమి సేకరించగా, 4,676 ఎకరాలు అటవీ భూమి ఉంది. ఇందులో 702.29 ఎకరాల్లో ఎంక్రోచర్స్ సాగు చేసుకునేవారు. వారికి కేసీఆర్ ఎకరానికి రూ.6 లక్షలు పరిహారం అందించారు. ఇలా ఒక్కో ఆటంకాన్ని అధిగమిస్తూ పనులు సాఫీగా సాగేలా చూశారు.

నీరు, బొగ్గు కోసం చర్యలు

విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన నీటిని కృష్ణా నది నుంచి తీసుకునేలా అనుమతులు పొందారు. నది నుంచి పైపులైన్ ఏర్పాటు చేశారు. బొగ్గు రవాణా కోసం సమీపంలో జాన్‌పహాడ్ రైల్వే క్రాసింగ్ నుంచి ప్లాంట్ వరకు రైల్వే లైన్ నిర్మించారు. రూ.100 కోట్ల వ్యయంతో 8కి.మీ రైల్వేలైన్ పనులు పూర్తయ్యాయి.

సవాళ్లను దాటుకుంటూ

కరోనా సమయంలో 10వేల మంది కార్మికులు తమతమ రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో ప్లాంట్ పనులు రెండేండ్లు నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, పనుల్ని తిరిగి పట్టాలెక్కించింది. కేసీఆర్ హయాంలోనే పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కానీ కొందరు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో కేసు వేయడంతో ఉత్పత్తికి అడ్డంకి ఏర్పడింది. అడ్డంకులు తొలగిపోవడంతో ఇప్పుడు ఉత్పత్తికి మార్గం సుగమమైంది.

'సేఫ్ సిటీ' ప్రాజెక్ట్‌పై డీజీపీ సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర పోలీస్ శాఖలో అమలు చేస్తున్న 'సేఫ్ సిటీ' ప్రాజెక్టు స్టేటస్‌పై డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ శనివారం సమీక్షించారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు, భరోసా కేంద్రాలు, సీసీటీవీ కెమెరాలు, ఫోరెన్సిక్ ల్యాబ్స్ పెలికాన్ సిగ్నల్స్ తదితర ఏర్పాట్ల పనితీరు గురించి అధికారులతో చర్చించారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్(సీడీఈడబ్ల్యూ) సెంటర్‌లలో అదనంగా మరో మూడింటిని మంజూరు చేయాలని పేర్కొన్నారు. రాచకొండ పరిధిలోని చౌటుప్పల్, భువనగిరి, సైబరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లిలో సీడీఈడబ్ల్యూ కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించారు. సేఫ్ సిటీ ప్రాజెక్ట్ నోడల్ అధికారి తరపున డీసీపీ డీ కవిత ప్రాజెక్ట్ పరిస్థితిని వివరించారు. సమీక్షలో సీఐడీ డీజీ శిఖా గోయల్, శాంతి భద్రతల అడిషనల్ డీజీ మహేశ్ ఎం భగవత్, పోలీస్ కమిషనర్లు అవినాశ్ మహంతి, సుధీర్‌బాబు, డీసీపీలు ఉషా విశ్వనాథ్, కే సృజన, డీ సాయి శ్రీ, జీహెచ్ ఎంసీ డీఈ మమత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి అఖిలేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ తెలంగాణ.. ప్రగతి చిరునామా

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ ఆర్థిక రంగానిది అద్భుతమైన విజయగాథ. దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణను స్ఫూర్తిగా తీసుకోవాలి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. మార్సెలస్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ వ్యవస్థాపకుడు సౌరభ్ ముఖర్జియా, నందిత రాజ్‌హన్సా ఇటీవలే రచించిన 'బిహోల్డ్ ద లివియాథాన్: ద అన్‌యూజువల్ రైజ్ ఆఫ్ మాడ్రన్ ఇండియా' పుస్తకంలో కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ సాధించిన ప్రగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేసీఆర్ హయాంను అద్భుత విజయంగా కొనియాడారు. ఈ పుస్తకంలోని తెలంగాణ అంశాలను ముత్తుకృష్ణన్ ప్రస్తావిస్తూ.. 'ఆరేండ్లలోనే రాష్ట్రం తలసరి ఆదాయంలో రెట్టింపు ఫలితాన్ని సాధించిందని సౌరభ్ ముఖర్జియా తన పుస్తకంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని నేను గతంలోనే చెప్పాను. తెలంగాణను, ముఖ్యంగా హైదరాబాద్‌ను కేస్ స్టడీగా తీసుకోవాలి' అని ప్రశంసించారు.

తలసరిలో అగ్రస్థానం

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తలసరి ఆదాయం రెట్టింపునకుపైగా వృద్ధి సాధించింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు 2014-15లో తలసరి ఆదాయం రూ. 1,24,104 మాత్రమే. 2023-24 నాటికి ఇది రూ. 3,47,299కు పెరిగింది. ఇదే సమయంలో జాతీయ తలసరి ఆదాయం 2023-24లో రూ. 2.12 లక్షలు మాత్రమే. రాష్ట్రం ఏర్పడినప్పుడు తలసరి ఆదాయంలో దిగువన ఉన్న తెలంగాణ.. 2023 నాటికి పెద్ద రాష్ట్రాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణ వ్యూహాత్మక పెట్టుబడులు, సంస్కరణలు, నగరీకరణ ఆర్థిక అభివృద్ధికి దోహపడ్డాయని నిపుణులు చెప్తున్నారు. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణలోని అనేక జిల్లాల తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నదని గణాంకాలు చెప్తున్నాయి. దేశంలోనే పెద్ద రాష్